# సామాజిక కోణంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కమిటీ

హైదరాబాద్: సామాజిక కోణంలో తెలంగాణ జాగృతి రెండో విడత రాష్ట్ర కమిటీని జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్త పర్యటనలు.. ఆ తర్వాత మూడో విడత కమిటీ ప్రకటన చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని ఎస్టీ నేతకు ఇచ్చారు. విజయదశమి సందర్భంగా కవిత రెండో విడత రాష్ట్ర కమిటీని ప్రకటించారు. తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎస్టీ నేత ఎల్. రూప్ సింగ్ నాయక్ ను నియమించారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యవర్గంలో 80 శాతానికిపైగా పదవులను బడుగు బలహీన వర్గాలకు కట్టబెట్టారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా కల్వకుంట్ల కవిత పర్యటించనున్నారు.. జిల్లా పర్యటనల్లో మేధావులు, కవులు, కళాకారులు, వివిధ రంగాల నిపుణులతో సమావేశం కానున్నారు. ప్రజలతో పాటు ఆయా రంగాల ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు త్వరలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యవర్గం మూడో విడత ప్రకటన ఉంటుందని కల్వకుంట్ల కవిత తెలిపారు. జాగృతిలో కొత్త బాధ్యతలు అప్పగించిన వారు సంస్థ ఆశయాలకు అంకితమై పని చేయాలని కల్వకుంట్ల కవిత గ సూచించారు. ఈ నియామకాలు వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

## మధ్యప్రదేశ్‌లో ప్రాణాలు తీస్తున్న దగ్గుమందు..
# 9కి పెరిగిన మృతుల సంఖ్య

**కలుషిత సిరప్ వల్లే కిడ్నీలు విఫలమయ్యాయని అనుమానం**

మధ్యప్రదేశ్: సాధారణ జ్వరం, దగ్గుకు వాడిన మందే చిన్నారుల ప్రాణాలు తీస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లాలో కలుషిత దగ్గు మందుల కారణంగా కేవలం పదిహేను రోజుల వ్యవధిలో ఏకంగా తొమ్మిది మంది చిన్నారులు కిడ్నీలు విఫలమై మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఛింద్వాడా జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాధారణ జ్వరంగా ప్రారంభమైన అనారోగ్యం, ప్రాణాంతకంగా మారడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఇప్పటివరకు తొమ్మిది మంది చిన్నారులు మరణించినట్లు పరాసియా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ శుభం యాదవ్ ధ్రువీకరించారు. మరణించిన చిన్నారులలో ఐదుగురు 'కోల్డ్‌రెఫ్' సిరప్, మరొకరు 'నెక్స్‌ట్రో' సిరప్ వాడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో డెక్స్ట్రోమెథోర్ఫాన్ హైడ్రోబ్రోమైడ్ ఉన్న దగ్గు మందులే ఈ మరణాలకు కారణమని అధికారులు బలంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా అనుమానిత దగ్గు మందుల పంపిణీని నిలిపివేసి, వాటి నమూనాలను పరీక్షల కోసం పంపింది. ఇదే తరహాలో రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో కూడా ఒక చిన్నారి మృతి చెందడంతో, జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్సీడీసీ) రంగంలోకి దిగింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలోని ఆసుపత్రులు, ఇతర ప్రాంతాల నుంచి నీరు, మందుల నమూనాలను సేకరించి, అంటువ్యాధుల కోణంలో కూడా పరీక్షిస్తోంది. ముందుజాగ్రత్త చర్యగా జ్వరం, జలుబు, ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్న సుమారు 1,420 మంది చిన్నారులను అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజులకు మించి అనారోగ్యంతో ఉన్న పిల్లలను సివిల్ ఆసుపత్రిలో ఆరు గంటల పాటు పరిశీలనలో ఉంచుతున్నారు. పరిస్థితి విషమిస్తే జిల్లా ఆసుపత్రికి తరలించి, కోలుకున్నాక ఆశా కార్యకర్తల పర్యవేక్షణలో ఉంచుతున్నారు. మరోవైపు, ప్రైవేటు వైద్యులు వైరల్ జ్వరాలకు చికిత్స చేయకుండా నేరుగా ప్రభుత్వ ఆసుపత్రులకు పంపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితుల నుంచి సేకరించిన నీటి, దోమల సంబంధిత నమూనాల నివేదికలు నార్మల్‌గా రావడంతో, అనుమానాలన్నీ దగ్గు మందులవైపే మళ్లుతున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం ఇప్పటికే 19 బ్యాచ్‌ల దగ్గు సిరప్‌ల అమ్మకాలపై నిషేధం విధించింది.

## రెండ్రోజుల్లో రూ. 419 కోట్ల అమ్మకాలు
# తెలంగాణలో మద్యం అమ్మకాల రికార్డు..

హైదరాబాద్: దసరా పండుగ, గాంధీ జయంతి ఒకేరోజు రావడంతో తెలంగాణలో మద్యం అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. పండుగకు ముందు కేవలం రెండు రోజుల్లోనే ఏకంగా రూ. 419 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే ఇది భారీ పెరుగుదల అని వారు తెలిపారు. ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 30న అత్యధికంగా రూ. 333 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీన మరో రూ. 86 కోట్ల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. వాస్తవానికి సెప్టెంబర్ 26 నుంచే రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు రెట్టింపైనట్లు అధికారులు పేర్కొన్నారు. నిన్న గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించింది. అదే రోజు దసరా పండుగ కూడా ఉండటంతో, మందుబాబులు ఒకరోజు ముందుగానే పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేశారు. ఈ కారణంగా అక్టోబర్ 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైన్ షాపులు, లిక్కర్ మార్ట్‌ల వద్ద విపరీతమైన రద్దీ కనిపించింది. పలుచోట్ల మద్యం కోసం జనం బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. పండుగ సీజన్‌తో పాటు డ్రై డే కూడా కలిసి రావడమే ఈ భారీ అమ్మకాలకు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు.

# బ్యాంకు కస్టమర్లకు గుడ్ న్యూస్..

ఢిల్లీ: బ్యాంకు కస్టమర్లకు ఇది శుభవార్త. చెక్కుల క్లియరెన్స్ కోసం ఇకపై రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం, రేపటి (అక్టోబర్ 4) నుంచి 'అదే రోజు చెక్ క్లియరెన్స్' విధానం అమల్లోకి రానుంది. దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకులైన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ సహా పలు బ్యాంకులు ఈ కొత్త విధానాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించాయి. ఈ నూతన విధానం వల్ల, కస్టమర్లు తమ ఖాతాలో జమ చేసిన చెక్కులు కేవలం కొన్ని గంటల్లోనే క్లియర్ అవుతాయి. చెల్లింపుల ప్రక్రియను మరింత వేగంగా, సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బీఐ ఈ మార్పులు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో, చెక్కులు బౌన్స్ కాకుండా ఉండేందుకు ఖాతాదారులు తమ అకౌంట్లలో సరిపడా నగదు నిల్వలు ఉంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. అలాగే చెక్కులపై వివరాలను తప్పులు లేకుండా స్పష్టంగా నింపాలని కోరుతున్నాయి. చెక్కుల భద్రతను పెంచేందుకు 'పాజిటివ్ పే సిస్టమ్'ను తప్పనిసరిగా ఉపయోగించాలని బ్యాంకులు స్పష్టం చేశాయి. దీని ప్రకారం, రూ.50,000 కంటే ఎక్కువ విలువైన చెక్కులను బ్యాంకులో జమ చేయడానికి కనీసం 24 గంటల ముందు ఖాతాదారులు కొన్ని కీలక వివరాలను బ్యాంకుకు అందించాలి. అకౌంట్ నంబర్, చెక్ నంబర్, తేదీ, చెక్ మొత్తం, లబ్ధిదారుడి పేరు వంటి వివరాలను బ్యాంకుకు తెలియజేయాలి. ఈ వివరాలను రీజనల్ ఆఫీసులకు కేటాయించిన ఈ-మెయిల్ ఐడీలకు పంపించాల్సి ఉంటుంది. బ్యాంకులో చెక్కును సమర్పించినప్పుడు, ముందుగా అందించిన వివరాలతో సరిపోల్చి చూస్తారు. అన్నీ సక్రమంగా ఉంటేనే చెక్కును క్లియర్ చేస్తారు. వివరాలు సరిపోలకపోతే ఆ చెక్కును తిరస్కరిస్తారు. రూ.5 లక్షలు దాటిన చెక్కులకు పాజిటివ్ పే విధానం తప్పనిసరి అని ఆర్‌బీఐ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం చెక్కుల క్లియరెన్స్ కోసం బ్యాంకులు చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్)ను వాడుతున్నాయి. దీనివల్ల ఏటీఎం లేదా డ్రాప్ బాక్సుల్లో వేసిన చెక్కులు క్లియర్ కావడానికి కనీసం రెండు రోజులు పడుతోంది. కొత్త విధానంతో ఈ జాప్యం పూర్తిగా తొలగిపోనుంది.

## శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు జలకళ... గేట్లు ఎత్తి నీటి విడుదల

శ్రీశైలం: కృష్ణా నదికి వరద ప్రవాహం పోటెత్తడంతో తెలుగు రాష్ట్రాల్లోని కీలక ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలు నిండుకుండలా మారాయి. ఎగువ నుంచి వస్తున్న భారీ వరద కారణంగా రెండు ప్రాజెక్టుల గేట్లను అధికారులు ఎత్తివేసి, లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణా నది పరీవాహక ప్రాంతాలు జలకళను సంతరించుకున్నాయి. వివరాల్లోకి వెళితే... జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయం దాదాపు పూర్తిస్థాయిలో నిండిపోయింది. ప్రాజెక్టులోకి 3,95,563 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, 10 స్పిల్ వే గేట్లను ఎత్తి 2,75,700 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 209.15 టీఎంసీలకు చేరుకుంది. మొత్తం ఔట్ ఫ్లో 3,46,374 క్యూసెక్కులుగా నమోదైంది. మరోవైపు, శ్రీశైలం నుంచి వస్తున్న నీటికి తోడు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు కూడా వరద కొనసాగుతోంది. సాగర్‌లోకి 2.94 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో అధికారులు ఏకంగా 22 క్రస్ట్ గేట్లను ఎత్తి 1.7 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు మొత్తం ఔట్ ఫ్లో 2.22 లక్షల క్యూసెక్కులుగా ఉంది. నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 302.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రెండు ప్రధాన ప్రాజెక్టుల గేట్లు ఏకకాలంలో తెరవడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.

## 'ధ్వని' వేగాన్ని మించిన వేగం..
# భారత అమ్ములపొదిలో కొత్త అస్త్రం

ఢిల్లీ: భారత రక్షణ రంగంలో మరో సంచలనం రాబోతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన బ్రహ్మోస్ క్షిపణిని మించిపోయే అత్యంత శక్తిమంతమైన ఆయుధాన్ని భారత్ సిద్ధం చేస్తోంది. 'ధ్వని' అనే పేరుతో దేశీయంగా అభివృద్ధి చేస్తున్న ఈ హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) వేగంగా అడుగులు వేస్తోంది. 'ధ్వని' క్షిపణి ధ్వని వేగం కన్నా ఐదారు రెట్లు అధిక వేగంతో ప్రయాణిస్తుంది. దీని వేగం గంటకు సుమారు 7 వేల కిలోమీటర్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ అసాధారణ వేగం 1500 నుంచి 2000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఇది అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. నిమిషాల వ్యవధిలోనే శత్రు స్థావరాలను ధ్వంసం చేసే సత్తా ఈ కొత్త అస్త్రానికి ఉంది. ఈ క్షిపణి ప్రత్యేకత కేవలం దాని వేగమే కాదు, ప్రయాణ మార్గంలో దిశను మార్చుకోగల సామర్థ్యం కూడా వుంది. ఈ కారణంగా శత్రు దేశాల గగనతల రక్షణ వ్యవస్థలు దీనిని గుర్తించి, అడ్డుకోవడం దాదాపు అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. సాధారణ క్రూయిజ్ క్షిపణుల్లా కాకుండా, దీనిని ముందుగా ఒక రాకెట్ బూస్టర్ సాయంతో అత్యంత ఎత్తుకు పంపిస్తారు. అక్కడ బూస్టర్ నుంచి విడిపోయిన 'ధ్వని' గ్లైడ్ వెహికల్, సెమీ-బాలిస్టిక్ మార్గంలో హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యం వైపు దూసుకెళ్తుంది. ఇది రాడార్ల కంట పడకుండా ఉండేందుకు దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే థర్మల్ మేనేజ్‌మెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు వంటి కీలకమైన ప్రాథమిక పరీక్షలను డీఆర్‌డీఓ ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేసింది. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే, హైపర్‌సోనిక్ టెక్నాలజీ కలిగిన అమెరికా, రష్యా, చైనా వంటి అగ్రరాజ్యాల సరసన భారత్ కూడా సగర్వంగా నిలుస్తుంది.

## ఇండియా జోలికొస్తే
# మీకే నష్టం..

మొదటి పేజి తరువాయి

భారీ నష్టం తప్పదని గట్టిగా హెచ్చరించారు. రష్యాలోని సోచి నగరంలో జరిగిన వాల్డాయ్ అంతర్జాతీయ చర్చా వేదికలో పుతిన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి భారత్ సహా 140 దేశాల నుంచి భద్రతా, భౌగోళిక రాజకీయ నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ "భారత్‌తో మాకు ఎలాంటి సమస్యలు లేవు, ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తలేదు. ప్రధాని నరేంద్ర మోదీ నా స్నేహితుడు. ఆయన నాయకత్వంలో భారత్ ఎవరి ఒత్తిళ్లకూ లొంగదు. అమెరికా మాట విని రష్యా నుంచి ఇంధనం కొనడం ఆపేస్తే భారత్ దాదాపు 9 నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు నష్టపోవాల్సి వస్తుంది" అని వివరించారు. అమెరికా చర్యలు ఆ దేశానికే నష్టం కలిగిస్తాయని పుతిన్ హెచ్చరించారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగిపోతాయని అన్నారు. ఇది అమెరికా ఫెడరల్ రిజర్వ్‌పై ఒత్తిడి పెంచి, వడ్డీ రేట్లను అధికంగా ఉంచేలా చేస్తుందని, తద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందని విశ్లేషించారు.

వాణిజ్య లోటుపై హామీ

భారత్ భారీగా ముడి చమురును దిగుమతి చేసుకోవడం వల్ల ఏర్పడిన వాణిజ్య అసమతుల్యతను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని పుతిన్ హామీ ఇచ్చారు. "భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలను అధికంగా కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నాం" అని ఆయన తెలిపారు. డిసెంబర్ నెలలో జరగనున్న తన భారత పర్యటన కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పుతిన్ పేర్కొన్నారు.

అమెరికా ద్వంద్వ నీతిపై విమర్శ

ఇదే సమయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ నీతిని పుతిన్ ఎండగట్టారు. "అణు విద్యుత్ కోసం అమెరికాకు పెద్ద మొత్తంలో ఇంధనం అవసరం. వారికి యురేనియం సరఫరా చేస్తున్న దేశాల్లో రష్యా రెండో స్థానంలో ఉంది. ఓ వైపు మా నుంచి యురేనియం కొనుగోలు చేస్తూ, మరోవైపు ఇంధన వాణిజ్యం విషయంలో భారత్‌పై ఒత్తిడి తేవడం అమెరికా ద్వంద్వ వైఖరికి నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

## తీరం దాటినా
# వీడని గండం...

ఒడిశా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీకాకుళం జిల్లాలోని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, తీవ్ర వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరాన్ని దాటింది. ఇది క్రమంగా వాయవ్య దిశగా పయనిస్తూ బలహీనపడుతున్నప్పటికీ, దీని ప్రభావం ఇంకా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. రానున్న గంటల్లో తీరం వెంబడి గంటకు 55 నుంచి 75 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒడిశాలో కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితి తీవ్రంగా మారుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరద నీరు వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్ర తనయ వంటి నదుల్లోకి చేరుతోంది. దీంతో వంశధార నదిపై ఉన్న హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసి, నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా, నారాయణపురం ఆనకట్ట వద్ద కూడా నాగావళి నదిలో నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతోందని అధికారులు తెలిపారు.

# నెత్తురోడిన దేవరగట్టు బన్ని ఉత్సవం..

## ఇద్దరి మృతి.. వంద మందికి గాయాలు



కర్నూలు: దసరా పర్వదినం రోజు కర్నూలు జిల్లాలో ఏటా జరిగే దేవరగట్టు బన్ని ఉత్సవం నెత్తురోడింది. సంప్రదాయం పేరిట జరిగే కర్రల సమరం హింసాత్మకంగా మారి ఇద్దరు భక్తులను బలిగొంది. ఈ ఘర్షణలో మరో వంద మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో దేవరగట్టులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

వివరాల్లోకి వెళితే... హొళగుంద మండలం దేవరగట్టులో దసరా సందర్భంగా గురువారం అర్ధరాత్రి మాళ మల్లేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు ప్రారంభమైంది. ఈ క్రమంలో దేవతామూర్తులను దక్కించుకునేందుకు రెండు వర్గాల భక్తులు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఏటా జరిగే ఈ కర్రల సమరం ఈసారి శ్రుతిమించి హింసకు దారితీసింది. ఈ భీకర పోరులో ఇద్దరు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ విక్రాంత పాటిల్, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు.

ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆచారం

దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామిని దక్కించుకోవడానికి నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల భక్తులు ఒక వర్గంగా, అరికెర, సుళువాయి, ఎల్లార్తి సహా ఏడు గ్రామాల భక్తులు మరో వర్గంగా విడిపోయి కర్రలతో తలపడతారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే, ఏటా ఈ ఉత్సవంలో వందల మంది గాయపడుతున్నా, ఈ ఆచారం మాత్రం ఆగడం లేదు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, భక్తులకు అవగాహన కల్పిస్తున్నా హింస మాత్రం ఎప్పటికప్పుడు పునరావృతమవుతూనే ఉంది.

# సర్‌క్రీక్‌పై పాక్‌కు రాజ్‌నాథ్‌సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్

గుజరాత్: సర్‌క్రీక్ ప్రాంతంలో పాకిస్థాన్ ఏవైనా సాహసాలకు పాల్పడితే భారతదేశం 'చరిత్రను, భూగోళాన్ని మార్చేలా' నిర్ణయాత్మక సమాధానం ఇస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం హెచ్చరించారు. ఈ సందర్భంగా గుజరాత్‌లోని భుజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ .. 'భారతదేశం పలుమార్లు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించింది. కానీ పాకిస్థాన్ ఉద్దేశాలు స్పష్టంగా లేవు. ఇటీవల సర్‌క్రీక్ వద్ద ఆ దేశం సైనిక సదుపాయాలు విస్తరించడం దాని అసలు ఉద్దేశాలను బహిర్గతం చేస్తోంది. 1965 యుద్ధంలో భారత సైన్యం లాహోర్ వరకు చేరగలదని నిరూపించింది. ఇప్పుడు, 2025లో, పాకిస్థాన్ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే - కరాచీకి వెళ్లే ఒక మార్గం సర్‌క్రీక్ గుండా కూడా ఉంది' అని వ్యాఖ్యానించారు.

సర్‌క్రీక్ అంటే ఏమిటి?

సర్‌క్రీక్ అనేది గుజరాత్‌లోని కచ్ ప్రాంతం మరియు పాకిస్థాన్ సింధ్ ప్రావిన్స్ మధ్య ఉన్న 96 కిలోమీటర్ల పొడవైన ఉప్పెన వాగు. ఇది అరేబియా సముద్రంలో కలుస్తుంది. 1968లో రణ్ ఆఫ్ కచ్ సరిహద్దు వివాదాన్ని అంతర్జాతీయ ట్రిబ్యునల్ పరిష్కరించినప్పటికీ, సర్‌క్రీక్‌పై తుది నిర్ణయం రాలేదు.

# 'కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలి'

మొదటి పేజి తరువాయి

కేంద్ర పాలసీలకు అనుగుణంగా కోర్టలల మనం వాదిస్తామనేది కీలకం రానున్న మూడేళ్లు కీలకం. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలి. తెలంగాణ లో అధికారంలో బీజేపీ రావాలి అంటే అందరం కలసి కట్టుగా పని చేయాలి. అర్జున్ రామ్ మేఘవల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారు. ప్రతి శాఖ అనేక రిఫార్మ్స్ తీసుకువస్తుంది. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి.బ్రిటిష్ చట్టాలు ఇప్పటికి అమలు అవుతున్నాయి. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని మోదీ ఆలోచన' అని పేర్కొన్నారు. ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ' కాలం చెల్లిన చట్టాలను మోదీ రద్దు చేశారు దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయి. మోదీ విజనరీ లీడర్ కాబట్టి సూక్ష్మంగా స్పందిస్తున్నారు. జీఎస్టీ తగ్గిపుతో దీపావళి వెలుగులు పేదల ఇళ్లల్లో నింపుతున్నారు. అగ్రదేశాల అడ్డగోలు టారిఫ్‌లతో తో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయి.ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. మన ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుంది. పెట్టుబడులు పెరుగుతాయి. ఇతరులకు ఉపాధి కలుగుతుంది' అని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ. ' త్వరిగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలు మోదీ సర్కార్ తెచ్చింది. హైదరాబాద్ నడి రోడ్డుపై న్యాయవాది దంపతులను నరికి చంపారు. కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారు. సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతుంది. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు రావాలి' అని పేర్కొన్నారు.

## భారత ప్రజాస్వామ్యంపై దాడి..
## దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు: రాహుల్‌పై భగ్గుమన్న బీజేపీ

ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటన మరోసారి రాజకీయ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. కొలంబియాలో ఆయన చేసిన వ్యాఖ్యలు భారత ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని, దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నమని బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. అధికారం చేజిక్కించుకోలేకపోతున్నామన్న నైరాశ్యంతోనే రాహుల్ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తింది. కొలంబియా పర్యటనలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... "బ్రిటీషర్లు దేశభక్తుల ప్రాణాలు తీసినా, భారత స్వాతంత్ర్య సమరయోధులు హింసాత్మకంగా స్పందించలేదు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యను బీజేపీ తీవ్రంగా తప్పుపట్టింది. ఇలాంటి మాటలతో మంగళ్ పాండే, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి విప్లవ వీరుల త్యాగాలను రాహుల్ అవమానించారని కమలం నేతలు మండిపడ్డారు. దేశం కోసం ప్రాణాలర్పించిన యోధులను కించపరచడం సరికాదని హితవు పలికారు. బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఈ విషయంపై ఘాటుగా స్పందించారు. "భారత్‌లో సంపూర్ణ ప్రజాస్వామ్యం ఉంది. అందుకే మీరు దేశమంతా తిరుగుతూ ప్రధాని మోదీపై తప్పుడు ఆరోపణలు చేయగలుగుతున్నారు. కానీ విదేశాలకు వెళ్లి ప్రజాస్వామ్యం లేదనడం సిగ్గుచేటు. దేశాన్ని అవమానిస్తే, ఇప్పుడున్న సీట్లు కూడా ప్రజలు గెలిపించరనే విషయాన్ని రాహుల్ గుర్తుంచుకోవాలి" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీకి అధికారం కావాలని, ఓట్లు రావడం లేదనే అక్కసుతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బీజేపీ శాఖ కూడా రాహుల్ వ్యాఖ్యలను ఖండించింది. రాజ్యాంగ విలువలను దెబ్బతీసేలా ఆయన పదేపదే ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. కొలంబియాలోని ఈఐఏ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రస్తుతం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ముప్పేట దాడికి గురవుతోందని, ఇదే దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ సేవలపై ఆధారపడి ఉండటం, ఉత్పత్తి రంగం బలంగా లేకపోవడం వల్ల ఉద్యోగాల కల్పన ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. చైనా అప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తుంటే, భారత్ ప్రజాస్వామ్య పద్ధతిలోనే దీనిని సాధించాల్సి ఉందని, ఇది సవాలుతో కూడుకున్నదని తెలిపారు.

## నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించేందుకు యూకే సిద్ధమైంది. ప్రస్తుతం బ్రిటన్ జైల్లో ఉన్న నీరవ్ మోదీని.. వచ్చే నెల 23వ తేదీన భారత్‌కు అప్పగించే అవకాశం ఉంది. ముంబై ఆర్థర్ రోడ్ జైల్లో నీరవ్ మోదీని ఉంచే అవకాశం ఉంది. గుజరాత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ(54) పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్నారు. దాదాపు ?14,000 కోట్ల మోసానికి పాల్పడి 2018లో దేశం విడిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన లండన్(యూకే)లో ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయన అప్పగింత కోసం భారత్ అభ్యర్థించగా.. ఆ కేసు అక్కడి కోర్టులో విచారణ జరుగుతోంది. అయితే తాజాగా నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. నీరవ్ మోదీకి భారత్‌లో అన్ని వసతులు కల్పిస్తామని, అత్యంత కట్టుదిట్టమైన ముంబై ఆర్థర్ రోడ్ జైల్లో ఉంచుతామని భారత్ హామీ ఇవ్వడంతో బ్రిటన్ కోర్టు అందుకు అంగీకరించింది. దాంతో నీరవ్ మోదీని భారత్‌కు రప్పించాలని ప్రయత్నానికి మార్గం సుగమం అయ్యింది. కాగా, ఈ ఏడాది జూలై నెలలో నీరవ్ మోదీ సోదరుడు నేహల్ మోదీని అమెరికాలో అరెస్టు చేశారు. అతడిని అప్పగించాలన్న భారత దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలు అభ్యర్థించాయి.

# యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి భారత్ ఎదగాలి

### స్వదేశీ స్ఫూర్తితో ఖాదీ సంత

ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి తొలుత జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. చేతివృత్తుల కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు, ఆర్గానిక్ వస్తువులను ఆసక్తిగా పరిశీలించారు. స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను గుర్తుచేసే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్టాల్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఉన్న రాట్నంపై నూలు వడికి గాంధీజీని స్మరించుకున్నారు. విజయదశమి పర్వదినాన ప్రారంభించిన ఈ స్వదేశీ సంత కార్యక్రమం గొప్ప విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ స్వదేశీ సంత భవిష్యత్తులో గ్లోబల్ సంతగా ఎదగాలని ఆకాంక్షించారు.

స్వదేశీ నినాదం కాదు.. ఉద్యమం కావాలి

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "భారతదేశానికి ఉన్న అతిపెద్ద బలం, సంపద మన జనాభాయే. ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్ మన దేశమే. 'బీ ఇండియన్, బై ఇండియన్' (భారతీయుడిగా ఉండు, భారతీయ వస్తువులనే కొనుగోలు చేయి) అనే నినాదం ప్రతి ఒక్కరిలో రావాలి. మన ఉత్పత్తులను మనమే వినియోగించుకుంటే, డిమాండ్ పెరిగి ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది" అని అన్నారు.

స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీజీ విదేశీ వస్త్రాలను తగలబెట్టమని ఇచ్చిన పిలుపు ఉద్యమానికి ఎలా ఊపిరి పోసిందో గుర్తుచేశారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, గ్రామ స్వరాజ్య మార్గాలతో పాటు స్వదేశీ నినాదాన్ని కూడా నేడు ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదంలాగే, స్వదేశీ ఉద్యమాన్ని మళ్లీ పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు.

2047 నాటికి ఆర్థిక అగ్రస్థానం లక్ష్యం



భారతదేశం నేడు అత్యంత పటిష్టమైన స్థితిలో ఉందని చంద్రబాబు అన్నారు. "ఒకప్పుడు చిన్న శాటిలైట్ ప్రయోగానికి కూడా ఇతర దేశాలపై ఆధారపడేవాళ్లం. కానీ ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు కూడా ఉపగ్రహాలు తయారు చేసి ప్రయోగించే స్థాయికి చేరుకున్నాం. కోవిడ్ మహమ్మారి సమయంలో మన దేశంలో తయారైన వ్యాక్సిన్లే ప్రపంచ దేశాల ప్రజల ప్రాణాలను కాపాడాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2038 నాటికి ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి అగ్రస్థానంలో నిలుస్తాం. ఇదే మనం భరతమాతకు ఇచ్చే నిజమైన నివాళి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ 2.0 వంటి సంస్కరణలు ప్రజల కొనుగోలు శక్తిని పెంచుతున్నాయని, వాటి ఫలాలు అందరికీ సమానంగా అందుతున్నాయని వివరించారు.

స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ ఖ్యాతి

ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్ తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. "కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, చేనేత వస్త్రాలు, కొబ్బరి ఉత్పత్తులు వంటి ఎన్నో నాణ్యమైన వస్తువులు మన రాష్ట్రంలో తయారవుతున్నాయి. వీటిని మనమే ప్రోత్సహించాలి. గతంలో మేం ప్రమోట్ చేసిన అరకు కాఫీ నేడు అంతర్జాతీయంగా గొప్ప బ్రాండ్‌గా మారింది. అదే విధంగా మిగతా ఉత్పత్తులకు కూడా గుర్తింపు తీసుకురావాలి" అని తెలిపారు. ఏటికొప్పాక, కొండపల్లి కళలతో పాటు చేనేత పరిశ్రమను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని తీసుకొచ్చి యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

సంస్కరణలతోనే సర్వతోముఖాభివృద్ధి

తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను, ఆ తర్వాత వాజ్‌పేయి వాటికి ఇచ్చిన ప్రోత్సాహాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. సంస్కరణలను అందిపుచ్చుకోవడం ద్వారానే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. విజయదశమి రోజున దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతామని ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు, చేనేత కళాకారులు అగ్గిపెట్టెలో పట్టేలా నేసిన పట్టుచీరను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు చంద్రబాబు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్నీ దహనం చేసిన వారిపై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోవాలి

**– సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్**

**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు:**
చిత్తూరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేయడం అత్యంత సిగ్గుచేటు అమానవీయ చర్యగా సిపిఐ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ఒక ప్రకటనలో ఖండించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం అణిచివేతకు గురైన వర్గాల నాయకుడు మాత్రమే కాదు భారత రాజ్యాంగ నిర్మాత అని గుర్తు చేశారు ఆయన విగ్రహాన్ని అపవిత్రం చేయడం అంటే భారత గణతంత్ర ఆత్మపై దాడి చేయడమేనని పేర్కొన్నారు ప్రభుత్వం వెంటనే నిందితులను గుర్తించి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం

**– ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**





**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు,**
శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో అనే పథకం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి స్వయంగా ఆటో నడుపుకుంటూ ఊరందూరు నుంచి పానగల్ రోడ్డులోని SLV కళ్యాణ మండపం వరకు ర్యాలీగా చేరుకున్నారు. ఎమ్మెల్యే వెంట వందలాది ఆటోలు భారీ ఎత్తున పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**ఆటో డ్రైవర్లకు రూ.3 కోట్లు లబ్ధి**
నియోజకవర్గానికి చెందిన 1883 మంది ఆటో డ్రైవర్లకు ప్రతి కుటుంబానికి రూ.15,000 చొప్పున మొత్తం రూ.3 కోట్ల రూపాయలు ఈరోజే అకౌంట్లలో జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఎన్నికల ముందు శ్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించగా, ఆటో డ్రైవర్లు నష్టపోకుండా ప్రత్యేకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**పాలాభిషేకం చేసిన ఆటో డ్రైవర్లు**
ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ముందుగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలపై పాలాభిషేకం నిర్వహించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**గత ప్రభుత్వంపై ఎమ్మెల్యే విమర్శలు**
ఎమ్మెల్యే బొజ్జల మాట్లాడుతూ “గత వైసీపీ పాలనలో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుడి చేత్తో పది ఇచ్చి, ఎడమ చేత్తో వంద లాగేశారు. గుంతల రోడ్లలో ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారు. ఆటోల రిపేర్లకు డబ్బులు సమకూర్చలేక వాహనాలు అమ్ముకోవాల్సి వచ్చింది. గ్రీన్ ట్యాక్స్ పేరుతో కూడా ఆటో డ్రైవర్లపై భారమేశారు. ప్రత్యేకంగా శ్రీకాళహస్తిలో డ్రైవర్లను మరీ ఎక్కువ ఇబ్బంది పెట్టారు” అని విమర్శించారు.

**భయం లేకుండా ఆటో నడపండి ఎమ్మెల్యే**
“ఇప్పుడు శ్రీకాళహస్తిలో ఎవ్వరూ భయపడకుండా ఆటోలు నడుపుతున్నారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ నడవాలి. ఎవరైనా ఇబ్బంది పెడితే నేరుగా నాకు తెలియజేయండి” అని ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి, సభ్యులు గోపి, గుర్రప్ప శెట్టి, ఆర్టీవో, మున్సిపల్ కమిషనర్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కావలిలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం..

**కావలి : గాయత్రి వార్తలు**
కార్యక్రమాన్ని ప్రారంభించిన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గారు.. ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున విడుదల కావలి నియోజకవర్గంలో 18,88 మంది ఖాతాలోకి నగదు జమకావలి నియోజకవర్గానికి రూ.2,83,00000 నగదు ఆటో డ్రైవర్ల ఖాతాలోకి జమ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముసునూరు పార్టీ కార్యాలయం నుంచి మద్దురుపాడు ఎస్ఎంకె కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ఆటో ర్యాలీ.. 6 కిలోమీటర్ల ఆటో నడిపిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ర్యాలీకి భారీగా హాజరైన ఆటో డ్రైవర్లు, కూటమి నాయకులు, ప్రజలు..




# న్యాలకల్ మండల కాంగ్రెస్ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సమావేశాన్ని నిర్వహించిన

**– మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డా ఏ.చంద్రశేఖర్**

**గాయత్రి వార్తలు:**
న్యాలకల్ మండలంలోని ముంగి చౌరస్తా ఏ ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో మాజీ మంత్రివర్యులు డాఎఎ.చంద్రశేఖర్ అధ్యక్షతన న్యాలకల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించటం జరిగింది.ఈ సమావేశంలో మాజీ మంత్రి డాఎచంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షుల ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల సంధర్భంగా ఎంపీటీసీ జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక విషయమై న్యాలకల్ మండల కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశగా ఉన్నావారు,పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసినవారు మీ మండల అధ్యక్షులు తెలియజేసిన వెంటనే వారు మండలంలోని అన్ని గ్రామాలలో అభ్యర్థులను పరిశీలించి ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్నా వారి పేర్లను ఇంచార్జ్ డా చంద్రశేఖర్ ద్వారా జిల్లా పార్టీ అధిష్టానానికి పంపించడం జరుగుతుంది.. మరియు కచ్చితంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మరియు గ్రామాలలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమా పథకాలను ప్రతి గ్రామంలో తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయాలని, నాయకులకు వారు దిశానిర్దేశం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , మాజీ జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి ,PACS ఛైర్మెన్ సిద్దిలింగయ్య ఏ.యం.సి.వైస్ ఛైర్మెన్ తురుపతి రెడ్డి మాజీ జడ్పీటీసీ చంద్రప్ప , మాజీ ఎంపీపీ రత్నం కాంగ్రెస్ నాయకులు మాక్సూద్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కిరణ్ గౌడ్ ,ఎస్సి సెల్ అధ్యక్షులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు..



# అధికారుల అండతో పూర్తయిన జి ప్లస్ త్రీ నిర్మాణం

**– నోటీసులు ఇచ్చాం అంటూ అండగా నిలిచిన అధికారులు**
**– అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచిన అధికారుల పై చర్యలు తీసుకునేది ఎవరు ?**
**– కొన్ని సంవత్సరాలుగా ఒకే మండలంలో ఎంపీ ఓ**
**– రిపోర్టర్లు పలుమార్లు ఫోన్ చేసిన స్పందించని ఎంపిఓ**
**– గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ జి ప్లస్ త్రీ నిర్మాణాలకు సహకరిస్తున్న ఎంపీ ఓ సెక్రెటరీ పై చర్యలు తీసుకోవాలి**





**గాయత్రి వార్తలు:**
లక్ష్మీదేవి పల్లి అక్టోబర్ 4 () భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం లో గిరిజన చట్టాలను1/70 యాక్టును తుంగలో తొక్కుతూ జి ప్లస్ త్రీ నిర్మాణాలు అధికారుల అండతో పూర్తయినాయి. ఇక ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న జి ప్లస్ త్రీ నిర్మాణాలు. పట్టించుకునే వారే లేకపోవడంతో జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలు జోరుగా మండలంలో కొనసాగుతున్నాయి. పంచాయతీ సెక్రటరీలు నోటీసులు ఇచ్చాం అంటూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప వారూ చేసేదేమీ లేదు.. గత కొన్ని సంవత్సరాలుగా ఎంపీఓగా ఒకే మండలంలో ఉండడంతో ఆయన ఆడిందే ఆటగా పాడిందే పాటగా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్న వారికి అండగా నిలుస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న పంచాయతీ సెక్రెటరీ ఎంపీఓలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు. ఐదు సంవత్సరాలు ఒకే మండలంలో పోస్టింగ్ ఉండడంతో అతను ఏదంటే అదే జరుగుతుంది. రెండు మూడు సంవత్సరాలకే బదిలీపై వెళ్లాల్సిన అధికారులు ఐదు సంవత్సరాలు అయినా ఒకే మండలంలో తిష్ట వేసుకొని ఉండడం వెనుక ఆంతర్యమేంటో అర్థం కాని పరిస్థితి లక్ష్మీదేవి పల్లి మండలంలో కొనసాగుతుంది. ఎంతగా అవినీతి జరుగుతుందో జి ప్లస్ త్రీ నిర్మాణాలు ఏ విధంగా రూపుదిద్దుకుంటున్నాయో ఎవరిని అడిగిన చెప్తారు. జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచేది మండల పంచాయతీ అధికారూ లే అనడంలో ఎటువంటి సందేహం లేదు. గత కొన్ని నెలలుగా పలు పత్రికలలో జి ప్లస్ త్రీ నిర్మాణాలపై ప్రచురించినప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న దాఖలాలు లేకపోయింది. నోటీసులు ఇచ్చాము చర్యలు తీసుకుంటాము అంటూనే నిర్మాణాలు పూర్తయి వారి గృహప్రవేశాలు దగ్గరుండి పూర్తి చేస్తున్నారా అనడంలో ఎటువంటి సందేహమే లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ అధికారుల అండతో నిర్మిస్తున్న ఈ అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కోరుతున్న ప్రజలు. ఈ జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న సెక్రటరీ ఎంపీఓలపై కఠిన చర్యలు తీసుకొని ఇటువంటి మరల పునరావృత్తం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరుతున్న ప్రజలు.

# బందోబస్తు కోసం వచ్చిన సీఐ ని బాధ్యున్ని చేయడం అన్యాయం

**– సీఐ రఘుపతి రెడ్డి పై ఆరోపణలు సరికాదు**
**– ఎన్.హెచ్.ఆర్.సి.జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్..**



**గాయత్రి వార్తలు:**
కూస సుదర్శన్ నర్సంపేట పట్టణంలో దసరా ఉత్సవం రోజున అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు స్థానిక బొడ్రాయి ఆవరణలో జరుగుతుండగా అక్కడికి పట్టణానికి సంబంధించిన ప్రజలందరూ వీక్షించడానికి రావడం జరిగినది.అట్టి సమయములో ప్రజలను కంట్రోల్ చేసే క్రమంలో సిఐ తన యొక్క విధి నిర్వహణలో ఉండడం జరిగినది.రెప్పపాటు క్షణంలో అతడు గమనించని సమయంలో పట్టణానికి చెందిన వారు జంతుబలి చేయడం జరిగినది ఇందులో సిఐ ప్రమేయం లేకుండా ఇట్టి విషయము జరిగినది. వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకాన్ని అదుపు చేసే క్రమంలో సిఐ తన విధి నిర్వహణ చేస్తుండగా ఇట్టి సంఘటనజరగడం జరిగినది. దీనిని ఉద్దేశ పూర్వకంగా కొంతమంది రాజకీయ నాయకులు మరియు కొంతమంది సంఘ పెద్దలు కావాలని సీఐ మీద ఆరోపణలు చేయడం సరికాదు ప్రతి విషయాన్ని కొందరు తమ స్వార్థం కోసం రాజకీయ నాయకులు రాజకీయం చేయడం సరికాదని ఎన్.హెచ్.ఆర్.సి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెంరమేష్ కోరడం జరిగినది.పోలీసులు అంటే అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడేవారు వారు వారు ఎలాంటి సమయంలోనా ఆపద ఆపద వచ్చినట్టయితే ప్రతిస్పందించే వ్యక్తులు వారే కాబట్టి వారి మీద నిరాధారణమైన ఆరోపణలు చేసి సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఉండకూడదని ఇట్టి విషయంలో సిఐ ది తప్పు లేదని తెలియపరచడం జరిగినది.

# సేల్స్ ఫోర్స్ సంస్థ ద్వారా వికలాంగులకు వీల్ చైర్లు పంపిణీ..!

**గాయత్రి వార్తలు:**
జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో శనివారం నాడు వై నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సేల్స్ ఫోర్ సంస్థ సహకారంతో పైడిగుమ్మల్ వీల్ చైర్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వై నరసింహ రెడ్డి మాట్లాడుతూ ఈ వీల్ చైర్స్ను సేల్స్ ఫోర్స్ సంస్థ వాళ్లు వికలాంగులకు వృద్ధులకు నడవలేని స్థితిలో ఉన్నటువంటి వికలాంగులకు వృద్ధులకు చేయూతన అందించే విధంగా వాళ్ళు వృద్ధాప్య ఆశ్రమాలకు 150 వీల్ చైర్స్ లను అందజేయగా నాకు 30 వీల్ చైర్స్ లను ఇవ్వగా కొన్ని హైదరాబాదులో, కొన్ని ఇక్కడే ఇవ్వడం జరిగిందని వికలాంగులకు సాయం చేయాలని స్వచ్ఛందంగా ముందుకొచ్చిన సేల్స్ ఫోర్స్ సంస్థ వాళ్లకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా మల్లన్న పటేల్ మాట్లాడుతూ వై నరసింహారెడ్డి చొరువతో వికలాంగులకు నడవలేని వృద్ధులకు మా గ్రామంలో వీల్ చైర్లు పంపిణీ చేసినందుకు సేల్స్ ఫోర్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, మాజీ ఎంపిటిసి జ్ఞానారత్నం, బూచానెల్లి స్వామిదాస్, ఎర్రని దావీదు, మర్పల్లి నర్సింలు, చీమల ప్రేమ్ కుమార్ ,చెల్మెడ శ్రీనివాస్, కొత్తూరు బాలరాజ్, నేరేడు మహేష్, బందెల స్వరాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.







# పవన్‌తో మరోమారు దిల్‌రాజ్ సినిమా

టాలీవుడ్ లో మరో క్రేజీ కాంబినేషన్ కు రంగం సిద్ధమవుతోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మరోసారి చేతులు కలపబోతున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'వకీల్ సాబ్' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే ఫార్ములాను రిపీట్ చేస్తూ, మరో ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మించడానికి దిల్ రాజు సన్నాహాలు చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, నిర్మాత దిల్ రాజు ఇటీవలే పవన్ కళ్యాణ్ డేట్స్ ను ఖరారు చేసుకున్నారు.'వకీల్ సాబ్' మాదిరిగానే, బలమైన సోషల్ మెసేజ్ తో పాటు, పవన్ కళ్యాణ్ మాస్ ఇమేజ్ కు, ఆయన అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉండేలా ఈ సినిమాను రూపొందించాలని ఆయన భావిస్తున్నారు. కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉంటూనే, కథలో ఒక సందేశం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం దిల్ రాజు ప్రస్తుతం సరైన కథ, దర్శకుడి కోసం అన్వేషణలో ఉన్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' రిలీజ్ కి రెడీ అవుతోంది. దిల్ రాజు సినిమా త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ వార్త తెలియగానే పవర్ స్టార్ అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. 'వకీల్ సాబ్' వంటి మరొక పవర్-ప్యాక్డ్ పెర్ఫార్మెన్స్ ను తమ అభిమాన నటుడి నుంచి ఆశిస్తున్నారు.




# ఓటీటీలోకి మిరాయ్

తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఫాంటసీ అడ్వెంచర్ 'మిరాయ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా తాజాగా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా అక్టోబర్ 10 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ సంస్థ ఓ పోస్టర్ పంచుకుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి రానున్నట్లు జియో హాట్‌స్టార్ తెలిపింది. కథేంటంటే: సామ్రాట్ అశోక్ కళింగ యుద్ధం గెలిచాక.. జరిగిన విధ్వంసాన్ని తలచుకుని పశ్చాత్తాప్పడతాడు. ఆ వినాశనానికి తనలోని దైవశక్తే ఓ కారణమని భావించి.. ఆ శక్తిని తొమ్మిది గ్రంథాల్లో నిక్షిప్తం చేసి.. వాటి రక్షణ బాధ్యతను తొమ్మిది మంది యోధుల చేతుల్లో పెడతాడు. కొన్ని శతాబ్దాల తర్వాత ఆ గ్రంథాలపై దుష్టశక్తి మహావీర్ లామా (మంచు మనోజ్) కన్ను పడుతుంది. అతను కోరుకున్నట్లుగా అమరత్వాన్ని సాధించి.. ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదగాలంటే తొమ్మిదో గ్రంథం అవసరమవుతుంది. కానీ, అమరత్వానికి సంబంధించిన ఆ గ్రంథాన్ని సొంతం చేసుకోవడం అంత తేలిక కాదు. ఎందుకంటే దానికి రక్షణగా ఉండేది అంబిక (శ్రియ). మహావీర్ రూపంలో ప్రపంచానికి ఎదురుకానున్న ముప్పును ముందే జ్ఞాన దృష్టితో చూసిన అంబిక.. అతన్ని ఎదుర్కొనేందుకు తనకు పుట్టిన బిడ్డ వేద (తేజ సజ్జా)ను పసికందుగా ఉన్నప్పుడే దూరం చేసుకుంటుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనాథగా వివిధ ప్రాంతాల్లో పెరిగిన వేద తన బాధ్యతను.. తల్లి ఆశయాన్ని ఎలా తెలుసుకుంటాడు? అన్నది తెరపై చూసి తెలుసుకోవాలి.



# 'అరి'..విడుదల ఖరారు



వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్ ప్రధాన పాత్రధారులుగా జయశంకర్ తెరకెక్కించిన చిత్రం 'అరి'. శ్రీనివాస్ రామిరెడ్డి, శేషు రెడ్డి మారంరెడ్డి, నాయుడు సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈనెల 10న థియేటర్లలోకి రానుందని ఇటీవల ప్రకటించారు. "మంచి సందేశంతో నిండిన వాణిజ్య చిత్రమిది. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: అనూప్ రూబెన్స్.

# పుకార్లకు ఫుల్‌స్టాప్

నిశ్చితార్థం చేసుకున్న గీగోవిందం జంట కొంతకాలంగా ప్రేమలో ఉన్న విజయ్ దేవరకొండ, రష్మిక త్వరలో వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఇరు కుటుంబాలు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో హైదరాబాద్‌లో వీరి నిశ్చితార్థం శుక్రవారం జరిగినట్లు సమాచారం. ఇరువురి కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లలో నిమగమవుతుండగా, ఫిబ్రవరిలో ఈ జంట పెళ్లి పీటలెక్కబోతుందని విశ్వసనీయ సమాచారం. ప్రముఖ సినీ, రాజకీయ, వ్యాపార రంగానికి చెందినవారంతా ఆ వివాహ వేడుకలో పాల్గనే అవకాశం ఉంది. విజయ్ దేవరకొండ, రష్మిక ఇప్పటికే కలిసి నటించిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల ద్వారా రొమాంటిక్ కెమిస్ట్రీతో మిలియన్ల అభిమానులను ఆకట్టుకున్నారు. అప్పట్నుంచి వీరి జంటపై అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన అటాచ్‌మెంట్ ఏర్పడింది. ఇప్పుడు వీరి వివాహం అధికారికమవుతుందన్న వార్తతో సోషల్ మీడియాలో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు.

# గోపిచంద్ మలినేనితో బాలయ్య సినిమా



వీరసింహారెడ్డి' విజయం తర్వాత కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని మరోసారి కలిసి పని చేయనున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమాని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 24న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు విజయ దశమి సందర్భంగా ప్రకటించారు. చారిత్రక అంశాలతో ముడిపడిన యాక్షన్ కథతో రూపొందనున్న చిత్రమిది. బాలకృష్ణ ఇందులో మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయని చిత్ర బృందం తెలిపింది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. ఇక ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2: తాండవం' సినిమాని డిసెంబరు 5న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు దసరా సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు విడుదల తేదీతో కూడిన కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సినిమాకి బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తుండగా.. రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు.

# సరికొత్త ప్రేమకథతో..


'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' చిత్రంతో సినీప్రియుల్ని మెప్పించిన దర్శకుడు క్రాంతి మాధవ్. ఇప్పుడాయన చైతన్య రావు హీరోగా ఓ ప్రేమ కథా చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పూర్ణ నాయుడు, వి శ్రీకాంత్ నిర్మిస్తున్నారు. ఐరా, సాఖీ కథానాయికలు. ఈ సినిమా శుక్రవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దేవా కట్టా క్లాప్ కొట్టగా.. కేఎల్ దామోదర్ ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. పూర్ణ నాయుడు, శ్రీకాంత్ స్క్రిప్ట్ అందించారు. వర ముళ్లపూడి గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం దర్శకుడు క్రాంతి మాధవ్ మాట్లాడుతూ.. "ఇదొక సరికొత్త న్యూఏజ్ లవ్‌స్టోరీతో రూపొందనున్న సినిమా. అందమైన లొకేషన్లలో భారీ స్థాయిలో తెరకెక్కించనున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యరావు, ఐరా, సాఖీ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్, ఛాయాగ్రహణం: వివిఎస్ జ్ఞానశేఖర్.



# స్టార్ కిడ్స్ ఇంబ్బందులు చెబితే నమ్మరు: జాన్వీ

నెపోటిజం, సినీ నేపథ్యం పదాలు ఇండస్ట్రీలో ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. బయటి వ్యక్తులు పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకోవడానికి ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కోవాలని స్టార్స్ సైతం అంగీకరిస్తుంటారు. తాజాగా ఈ అంశంపై జాన్వీకపూర్ ఓ చర్చలో మాట్లాడారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారని కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. 'ఇన్‌సైడర్  అవుట్‌సైడర్' చర్చలో పాల్గొన్న జాన్వీకపూర్ నటీనటులను బయట వ్యక్తులు, సినీ పరిశ్రమకు చెందినవారు అని విభజించడం తనకు ఇష్టం లేదన్నారు. బయట నుంచి పరిశ్రమకు వచ్చినవారితో ఇండస్ట్రీ వారి కష్టాలను పోల్చడం అన్యాయమని అన్నారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయి. వాటిని వినడానికి కూడా ఎవరూ ఆసక్తి చూపరు. అయినా ఇండస్ట్రీలో ఉన్న స్టార్ కిడ్స్ ఎవరూ కష్టాలు పడ్డామని చెప్పరు. ఎందుకంటే బయటి వారితో పోల్చితే వారికి లభించిన సౌకర్యాలకు వారెప్పుడూ కృతజ్ఞతతోనే ఉంటారు. అలాకాకుండా 'మేం ఇంత కష్టపడుతున్నాం' అని చెబితే ఎవరూ వినరు. బయటి నుంచి వచ్చిన వ్యక్తులు ఇండస్ట్రీలో గుర్తింపుతెచ్చుకోవాలంటే ఎన్నో పోరాటాలు చేయాలని నేనూ అంగీకరిస్తాను. ఆ పోరాటాలు స్టార్ కిడ్స్‌కు అర్థం కావని జాన్వీ తెలిపారు.శ్రీదేవి కుమార్తెగా వెండితెరకు పరిచయమై.. మంచి పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు జాన్వీకపూర్. ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోనూ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. వరుణ్ ధావన్‌తో కలిసి ఆమె నటించిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది.

# దూకుడు మీదున్న ధనుష్



ఈ ఏడాది సౌత్ హీరోల నుంచి వరుస సినిమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. అదే తరహాలో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటుడు ధనుష్ కూడా హిట్ ఫట్ తో సంబంధం లేకుండా తన సినిమాలతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే కుబేర, ఇడ్లీ కొట్టు సినిమాలను ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసిన ధనుష్, వీటి తర్వాత కూడా వెనక్కి తగ్గకుండా మరిన్ని ప్రాజెక్టులను రెడీ చేస్తున్నాడు. బాలీవుడ్‌లో తన మరో సినిమా తేరే ఇష్క్ మైన్న్ ÷నైల్ స్టేజ్‌కి చేరుకుంది. ఈ చిత్రం నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో కూడా తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్కెట్ ఉన్న ధనుష్, ఈ మూవీతో బాలీవుడ్ ఆడియన్స్‌ను మళ్లీ ఆకట్టుకోబోతున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత ఎక్కువ గ్యాప్ లేకుండానే తన 54వ సినిమా కూడా థియేటర్లలోకి రానుంది. దర్శకుడు విగ్నేష్ రాజా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ షూటింగ్ ఇటీవలే పూర్తి అయ్యింది. అందువల్లే ఫిబ్రవరి 2026 లో ఈ సినిమా రిలీజ్ చేయాలని మేకర్స్ ఇప్పటికే నిర్ణయించుకున్నారని సమాచారం. ఇలా వరుస సినిమాలను ఎ÷-లాన్ చేస్తూ, రిలీజ్ చేసేందుకు సిద్ధం అవుతున్న ధనుష్ తన కెరీర్ పేస్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఒకేసారి తమిళం, హిందీ సినిమాలు చేస్తూ, విభిన్న జానర్స్‌లో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్న ధనుష్ రాబోయే నెలల్లో ఫ్యాన్స్‌కి నిజంగానే ఫుల్ మాస్ ట్రీట్ ఇవ్వబోతున్నాడు.